
తంటికొండలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


రౌతులపూడి మండలం ములగపూడిలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


తునిలో పల్లకీలో స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు


ప్రత్తిపాడులో వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కనుల వైకుంఠం

- భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు
- తెరచుకున్న ఉత్తర ద్వారాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

తుని: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని వైష్ణవాలయాలకు సోమవారం భక్తులు పోటెత్తారు. ఉత్తర (వైకుంఠ) ద్వారాలు తెరచుకోవడంతో వేలాది మంది భక్తులు ఉత్తరద్వారం నుంచి స్వామివారిని దర్శించి తరించారు. స్థానిక పాత బజారు వీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి ఊరేగించారు. ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి ప్రసాదాలను అందించారు. దేవస్థానం చైర్మన్ అన్నవరం శ్రీను, ఈఓ పి.విశ్వనాథరాజు పాల్గొన్నారు.

తుని రూరల్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఎస్.అన్నరవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని భక్తులు ఉత్తర ద్వారం నుంచి దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి వేలాది మంది భక్తులు స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, ఆలయ చైర్మన్ కోలా భీమేశ్వరరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

తొండంగి: దానవాయిపేట వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానార్చకుడు శుంకరణం వెంకట్రాజు శర్మ ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యుడు మడదా ప్రభాకరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రత్తిపాడు రూరల్: ఉత్తరకంచిలో పద్మావతి అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు. రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి, ధర్మవరంలో వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.


రత్నగిరిపై విద్యుత్ దీపాల వెలుగులో పుష్పాలంకరణ చేసిన ధ్వజస్తంభం

కిర్లంపూడి: చిల్లంగిలో వేంకటేశ్వరస్వామి, గెద్దనాపల్లిలో వేణుగోపాలస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఏలేశ్వరం: స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో ఉత్తరద్వార నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు. విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గావెంకటప్రసాద్, కటకం కిరిటీ, ఆలయ ధర్మకర్తలు గోపువెంకట్రావు, సుబ్బయమ్మ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వరాస్వామికి ఆలయం(బాలాజీచౌక్)లో ప్రత్యేక పూజలు, శ్రీనివాసహోమం నిర్వహించారు. మహిళలు విష్ణుసహస్ర నామపారాయణ, లలితాసహస్ర నామపారాయణ, భజనలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు గోపు వెంకట్రావు, గోపు చిట్టిబాబు దంపతులు ప్రసాద వితరణ చేశారు.

ప్రత్తిపాడు: స్థానిక రుక్మిణీసత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తొలుత ఆలయ అర్చకుడు నరసింహాచారి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.


తొండంగి మండలం దానవాయిపేటలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


గుమ్మళ్లదొడ్డి శ్రీరామగిరి కొండపై పూజలు చేస్తున్న భక్తులు


తుని మండలం ఎస్.అన్నవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి (జీయ్యన్న మఠం) ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. పండితులు తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గరుడ, అశ్వ, హంస, పొన్న, శేష వాహనాల్లో ఊరేగించారు. చిన్నారులు కోలాట ప్రదర్శనతో అలరించారు.

గోకవరం: తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. విశేష సంఖ్యలో భక్తులు గరుడవాహనంపై వేంచేసిన స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ఈఓ ఆర్‌వీ చందన, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గుమ్మళ్లదొడ్డిలో శ్రీరామగిరి కొండపై వేంచేసిన శ్రీకోదండరామ సహిత రమాసత్యనారాయణ స్వామి, గోకవరంలో సత్యనారాయణస్వామి ఆలయాల్లో భక్తులకు ఉత్తరద్వారం నుంచి దర్శనాలు కల్పించారు.

రామగొరికొండపై గిరిప్రదక్షిణ

రౌతులపూడి: మండలంలోని ములగపూడి రామగొరికొండపై ఏకశిలలో వెలసిన సీతాకోదండరామ స్వామి వారి ఆలయం చుట్టూ సోమవారం భక్తులు ప్రదక్షిణ చేశారు. ములగపూడి, గంగవరం, రాజవరం, కోటనందూరు, తుని తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు సుమారు కిలోమీటరుకు పైగా గిరిప్రదక్షిణ చేశారు. సీతాకోదండస్వామికి దర్శించుకుని ప్రత్యేక పూజలు, భజనలు చేశారు.


ధర్మవరంలో స్వామి వారిని పలకీలో ఊరేగిస్తున్న భక్తులు

రత్నగిరిపై..

అన్నవరం: రత్నగిరిపై ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయం, పరిసరాలను పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేలాది మంది భక్తులు సత్యదేవుని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


తాళ్లూరులో అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు


ఏలేశ్వరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో భజనలు చేస్తున్న మహిళలు


ప్రత్యేక అలంకరణలో చిల్లంగి వేంకటేశ్వరస్వామి


ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


గండేపల్లి మండలం తాళ్లూరులో కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

క్లుప్తంగా

బెల్లపు ఊట ధ్వంసం

గండేపల్లి: సూరంపాలెం గ్రామ శివారులో సారా తయారీ కేంద్రాలపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పది లీటర్ల సారా, 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. ఇందుకు కారణమైన నక్క సత్యనారాయణను అరెస్ట్ చేసి పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

మహాసేన రాజేష్‌పై దాడి అమానుషం

ప్రత్తిపాడు: మహాసేన నాయకుడు సరిపల్లి రాజేష్‌పై రాజమహేంద్రవరంలో జరిగిన దాడిని ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీ ఐక్య సంఘర్షణ సమితీ కన్వీనర్ ఏపూరి శ్రీను ఖండించారు. సోమవారం ఆలయ స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తున్న రాజేష్‌పై కొంతమంది వ్యక్తిగత కక్షలతో దాడి చేసి, హత్య చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. దళితులపై దాడి చేయడం దురదృష్టకరమన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీపీఎస్ రద్దు కోరుతూ 3కే వాక్

జగ్గంపేట: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జగ్గంపేటలో సోమవారం 3కే వాక్ నిర్వహించారు. స్థానిక గోకవరం రోడ్డు నుంచి పంచాయతీ కార్యాలయం వరకూ ర్యాలీ చేశారు.

నరేంద్రగిరి శుభ్రతకు నిర్ణయం

ప్రత్తిపాడు: స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకుని ప్రత్తిపాడు జాతీయ రహదారిపై ఉన్న నరేంద్రగిరిని శుభ్రం చేసేందుకు పరిషత్ సభ్యులు నిర్ణయించారు. స్థానిక నరేంద్రగిరిపై ఉన్న భారీ వివేకానందుని విగ్రహం వద్ద స్వామి వివేకానంద పరిషత్ చైర్మన్ డీవీఎస్ రమేష్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం పరిషత్ సమావేశం జరిగింది. కొండపై గుబురుగా పెరిగిన తుప్పలను తొలగించేందుకు, భారీ విగ్రహానికి రంగులు వేయించేందుకు సభ్యులు నిర్ణయించారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో రామకృష్ణ భావ పరిషత్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, పరిషత్ కార్యదర్శి ఏడిద రెడ్డినాయుడు, ఆర్ఎస్ఎస్ ఖండ ప్రముఖ్ ముక్కు సుబ్రహ్మణ్యం, చిట్రా అప్పారావు, అన్నవరం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు శింగిలిదేవి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- జి.ముసలయ్యపేటలో గడపగడపకూ మనప్రభుత్వం


జి.ముసలయ్యపేటలో వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని జి.ముసలయ్యపేటలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు విద్యుత్, రోడ్లు, డ్రైన్లు తదితర సమస్యలను మంత్రి రాజా దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించి సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షించారు. స్పందనలో వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గాబు రాజు, కొయ్యా మురళి, దూలం బాబూరావు, దూలం నూకరాజు, ఎంపీడీఓ పసపులేటి సతీష్, పంచాయతీ కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి కాలం చెల్లింది

- మంత్రి దాడిశెట్టి రాజా
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి 50 మంది చేరిక

తొండంగి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాజకీయాల్లో టీడీపీకి కాలం చెల్లిందని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని జి.ముసలయ్యపేటలో సోమవారం టీడీపీకి చెందిన 50 మంది నాయకులు మంత్రి దాడిశెట్టి రాజా సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నేమాల సత్తిబాబు, యాదాల వెంకటేశ్వరరావు, తాటిపర్తి సత్తిబాబు, యాదాల బాబ్జి, తాటిపర్తి అబ్బాయి, యాదాల చెల్లారావు, పిర్ల కోటేశ్వరరావుతో సహా మరో 50 మంది పార్టీలో చేరగా వారికి మంత్రి రాజా కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.


జి.ముసలయ్యపేటలో మంత్రి దాడిశెట్టి రాజా సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నేతలు

పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గాబు రాజు, కొయ్యా మురళి, దూలం బాబూరావు, దూలం నూకరాజు, దూలం మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు కంచాల బహూకరణ

కోటనందూరు: మండలంలోని అల్లిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సోమవారం దాతలు కంచాలు బహూకరించారు. గ్రామానికి చెందిన కాపారపు తేజశ్విని ఆర్థిక సాయంతో సమకూర్చిన కంచాలను ఎంపీటీసీ సభ్యురాలు నెమ్మాది నాగమణి, వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ చింతకాయల చినబాబు అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు అందజేశారు. చిన్నారులకు మెరుగైన విద్యతో పాటు మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఎంపీటీసీ నాగమణి సూచించారు.


అల్లిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కంచాలు పంపిణీ చేస్తున్న నాయకులు

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం


శంఖవరం కేజీబీవీలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. స్థానిక కేజీబీవీలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు సోమవారం ఆయన బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేద విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేస్తోందన్నారు. నాడు-నేడు పథకంతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్‌వీ రమణ, ప్రిన్సిపాల్ బాలామణి కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు బుర్ర లచ్చబాబు, చింతనీడి కుమార్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

తుని: పిఠాపురం – గొల్లప్రోలు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. తుని జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. పిఠాపురం సీతారాంపురానికి చెందిన బంగారు రఘు (20) రైలు పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న రైలు ఢీకొని, అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు అభినందనలు


క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఈఓ సత్యనారాయణ మూర్తి

అన్నవరం: జిల్లా కేంద్రం కాకినాడలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో స్థానిక సత్యదేవ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. హాకీ అండర్-19 విభాగంలో వై.శిరీష, బి.సంతోష్‌కుమార్, టైక్వాండోలో వెంకన్నదొర ప్రతిభ చూపి ప్రథమస్థానం పొందారు. వీరిని దేవస్థానం ఈఓ సత్యనారాయణ మూర్తి సోమవారం అభినందించారు. భవిష్యత్‌లో జరిగే క్రీడా పోటీల్లో మరింత ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


ఎ.మల్లవరం సచివాలయం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛనుదారులు

రౌతులపూడి: మండలంలో ఎ.మల్లవరంలో నూతనంగా పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్లు తలుపుతట్టి పింఛన్లు అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిందాడ పెదరాజు, ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు సోమవారం పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బొగడా లోవరాజు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల స్థలదాత కాకి నాని, గ్రామ పెద్దలు పెద్దాపురం, రామకృష్ణ, బొడ్డు నాని ప్రిన్సిపాల్ ప్రసాదానం పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- భద్రవరంలో గడపగడపకూ మనప్రభుత్వం

ఏలేశ్వరం: సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని భద్రవరంలో సోమవారం ఆయన గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అవ్వాతాతలకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్మును ఈ నెల నుంచి రూ.2750 పెంచారన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ బదిరెడ్డి గోవిందు, సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు, వైస్ ఎంపీపీ సాదే లోవరాజు, సొసైటీ అధ్యక్షులు చిక్కాల లక్ష్మణరావు, కొండపల్లి వెంకటేశ్వరరావు, అడపా పార్థసారథి, నీరుకొండ సత్యనారాయణ, ఉగ్గిరాల రాజు, కూనపురెడ్డి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


భద్రవరంలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

గరుడ వాహనంపై సత్యదేవుని ఊరేగింపు

అన్నవరం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం రాత్రి సత్యదేవుడు, అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవార్లను గరుడ వాహనం మీద ఘనంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేదపండితులు కోట శ్రీనివాస్, పీఆర్వో కృష్ణారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


గరుడ వాహనం మీద సత్యదేవుని ఊరేగిస్తున్న భక్తులు